క్లుప్తంగా

సీబీసీఎన్‌సీ ద్వారా సేవా పురస్కారాలు



ఆర్థిక సాయం అందిస్తున్న ఆనంద్‌బాబు

ఏలూరు (టూటౌన్) : సీబీసీఎన్‌సీ, సీబీఎం సంస్థ ఏర్పడి మార్చి 12 నాటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు సంస్థ కృష్ణా అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర ఆనంద్ బాబు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది వైద్యం కోసం ఆర్థిక సాయం అందజేశారు. మార్చి 12న కాకినాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఘనంగా 150 సంవత్సరాల ఉత్సవాలు నిర్వహిస్తామని, సీబీసీఎన్‌సీ అధ్యక్షులు ముత్తాబత్తుల రత్నకుమార్ ద్వారా సేవా పురస్కారాలు అందిస్తామని తెలిపారు.

రవన్నకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): గోదావరి లోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్‌రాయల సుభాష్ చంద్రబోస్ అలియాస్ రవన్న 8వ వర్ధంతి కార్యక్రమం స్థానిక వన్‌టౌన్ ఏడు గోళీల సెంటర్‌లోని అమర వీరుల స్థూపం వద్ద గడసాల రాంబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ ఏలూరు కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. ముందుగా వైఎంహెచ్ఏ సెంటర్ నుంచి ప్రదర్శనగా ఏడు గోలీల సెంటర్‌కు చేరుకుని, సభ నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

ఏలూరు రూరల్: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో శనివారం మహిళ దినోత్సవం నిర్వహించారు. ఏఎస్ఆర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కే అక్బర్, అరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యుడు ఎస్‌కే సత్తార్, విశ్వనాథ్ మాధవరావు, ఎస్‌కే లాల్‌సాహెబ్, కొమ్మ నాగరాజు, జున్నూరు నరసింహారావు, జల్లా వీరభద్రరావు, బాపూజీ తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్‌లో పలువురు మహిళల సేవలను కొనియాడుతూ మెమెంటోలు అందజేశారు.

నేడు వడ్డిగూడెంలో చేయూత చెక్కుల పంపిణీ

పెదపాడు: మండలంలోని వడ్డిగూడెంలో చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జె.తేజరతన్ తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. అనంతరం పాదయాత్ర కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ఈకార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

పేదలకు కొల్లేరు మిగులు భూములు

- ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి
- మొండికోడులో అభివృద్ధి పనులు ప్రారంభం





మొండికోడులో మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు, కార్యక్రమానికి హాజరైన మహిళలు

ఏలూరు రూరల్ : కొల్లేరులో మిగులు భూములు పేదలకు పంచుతామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి హామీ ఇచ్చారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మొండికోడులో వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన భూముల రీ సర్వే కొల్లేరు గ్రామాల్లో సైతం చేపట్టామన్నారు. సర్వే పూర్తి కాగానే సుమారు 15 వేల ఎకరాల ప్రభుత్వ మిగులు భూములు వెలుగులోకొచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ భూములన్నీ కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న భూమి లేని పేదలకు ఎకరం చొప్పున పంపిణీ చేస్తామన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలనలో ఉందని తెలిపారు. కొల్లేరు ప్రజలు సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. రానున్న ఎన్నికల్లో రెండోసారి వైఎస్సార్ సీపీకి విజయం చేకూర్చాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పథకాలన్నీ ఆగిపోతాయన్నారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు ప్రొఫెసర్ అని ఎమ్మెల్యే అన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే వెన్నుపోటు, కుట్ర, కుతంత్రాలతో పాటు మోసం, దగా కనిపిస్తాయని చెప్పారు. ప్రజలను మోసం చేసి ఎన్నికల్లో గెలవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి, గద్దె ఎక్కిన తర్వాత మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టేశారని గుర్తు చేశారు. రుణమాఫీ పేరుతో రైతాంగం వెన్ను విరిచారన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారం కోసం మరోసారి కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేసేందుకు వస్తాడన్నారు. అధికారంలోకి వస్తే మరుక్షణం సంక్షేమ పథకాలు రద్దు చేస్తాడని హెచ్చరించారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రూ.5 కోట్లు నుంచి రూ.6 కోట్లు అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. పథకాలతో అన్ని వర్గాల ప్రజలూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి నూటికి 70 శాతం ఓట్లు పోలౌతాయన్నారు. పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్ మాట్లాడుతూ అబ్బయ్యచౌదరి గెలిచిన నాటి నుంచి దెందులూరు నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని వివరించారు. టీడీపీ హయాంలో నాయకులు సృష్టించిన గొడవలు, కొట్లాట, సెటిల్‌మెంట్లతో ప్రజలు విసిగిపోయారని గుర్తుచేశారు. మరోసారి దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీనే గెలిపించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే 2,727 మంది మహిళలకు ప్రభుత్వం విడుదల చేసిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత నగదు రూ.5.11 కోట్ల చెక్కును అందజేశారు. చాటపర్రు 1వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మొండికోడులో రూ.19 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ సెంటర్, ప్రహరీ, రూ.15.40 లక్షలతో వేసిన తాగునీటి పైప్‌లైన్, రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, రూ.7 లక్షలతో జంబో షెడ్డును ప్రారంభించారు. పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుడిపూడి రఘు, వేజెళ్ల గోపాలకృష్ణంరాజు, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, డైరెక్టర్ మండల కొండలరావు, ఏపీఎం ప్రభావతి, బలే నాగప్రసాద్, బలే బలరామయ్య, రుక్మనంద్, బలే నాగరాజు, వీరంకి పండు, సత్తిబాబు, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.



చాటపర్రులో సీసీరోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

పౌష్టికాహార ప్రాముఖ్యత తెలుసుకోవాలి



గుడివాకలంకలో పౌష్టికాహార ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఏలూరు రూరల్ : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లలు, గర్భిణులు మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగౌతుందని సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో పోషణ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలు, తల్లుల కోసం ప్రభుత్వం పోషకాహారం అందిస్తోందన్నారు. పోషక ఆహారం కోసం ప్రతి ఒక్కరిలోనూ అవగాహన పెరగాలని సూచించారు. ఇందుకోసం ఈ నెల 9 నుంచి 23 వరకు ప్రతి గ్రామంలోనూ తల్లులు, పిల్లలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం సుపోషణ దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం మీనాక్షి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన ప్రత్తికోళ్ల లంక, గుడివాక లంక గ్రామాల్లో శనివారం సాయుధ దళాలు, ఏలూరు రూరల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరు ఏలూరు రూరల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి లంక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఐకమత్యంతో ఉండి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏలూరు రూరల్ పోలీస్ సిబ్బంది, సాయుధ దళాల సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లేరు ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు



ప్రత్తికోళ్ల లంక, గుడివాక లంక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర కీలకం

ఏలూరు రూరల్: ఎన్నికల నిర్వహణలో మీడియా కీలక భూమిక పోషించాలని జిల్లా స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్రపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల్లో ఎన్నికల సంఘం నిబంధనలు అమలయ్యేలా మీడియా సహకరించాలని కోరారు. ఫేక్, పెయిడ్ న్యూస్ ప్రచురించడం లేదా ప్రసారం చేయడం ఓటర్ల తప్పుదారి పట్టించే ప్రయత్నం ఎన్నికల నియామవళికి విరుద్ధమని హెచ్చరించారు. కుల, మత, భాష ప్రాతిపదికన ఓట్లు అడగడం, ఓటర్లను ప్రేరేపించడం నిషిద్ధమన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో సగటు 79.77 శాతం ఓటింగ్ నమోదైతే, జిల్లాలో 83.79 శాతం నమోదైందని గుర్తుచేశారు. విద్యావంతులు ఎక్కువగా ఉన్న ఏలూరు నియోజకవర్గంలో 68.10 శాతం మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం 'ఓటు కన్నా ముఖ్యమైన పని లేదు.. నా ఓటు హక్కు నేను తప్పనిసరిగా వినియోగించుకుంటాను' అనే నినాదంతో 92 శాతం ఓటింగ్ పెంచేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. ఎన్నికల్లో అభ్యర్థులు పార్లమెంట్ స్థానానికి రూ.95 లక్షలు, అసెంబ్లీ స్థానానికి రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. అంతకుమించి ఖర్చు చేస్తే అభ్యర్థులు అనర్హులవుతారని చెప్పారు. జిల్లా పౌర సంబంధ అధికారి ఆర్‌వీఎస్ రామచంద్రరావు మాట్లాడుతూ న్యూస్ చానెల్స్, కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, ఎస్ఎంఎస్ వాయిస్ తదితర మాధ్యమాలు ఎన్నికల్లో రాజకీయ ప్రకటనలో చేసే ముందు మీడియా సంస్థలు మానటరింగ్ కమిటీ జిల్లా మీడియా సర్టిఫికేషన్ పొందాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎంసీఎంసీ కమిటీ సభ్యులు ఎల్ వెంకటేశ్వరరావు, వి.మధుసూర్యప్రకాష్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్

అలరించిన శాస్త్రీయ నృత్య కార్యక్రమాలు





నాట్యాచార్య హేమసుందర్ శిష్యుల కూచిపూడి నృత్య ప్రదర్శన, త్రికాయ డ్యాన్స్ ఫౌండేషన్ కళాకారుల నాట్య విన్యాసం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి మహోత్సవాల్లో వైభవంగా శనివారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరే రామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పట్టాభిరామ భజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం, హరే శ్రీనివాస కీర్తనలు ఆలపించారు. గుడిపాటి లలిత త్యాగరాజ స్వామి కీర్తనలు అనే అంశంపై వ్యాఖ్యానం చేశారు. సాయంత్రం మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యుల సౌజన్యంతో త్రికాయ డ్యాన్స్ ఫౌండేషన్‌కు చెందిన కళాకారులు సంస్కృతి పరిరక్షణ పరంపర పేరుతో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను అబ్బుర పరిచాయి. రాత్రి నగరానికి చెందిన అభినయ నృత్య భారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య డి.హేమ సుందర్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	06
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	11
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	98512	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.10	98503	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	52
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	30	కంద	68
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	30-40	కీరా దోస	48
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	84
కాలీఫ్లవర్	30	అల్లం	120
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	40-44	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళాదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

నంది వాహనంపై ఊరేగిన శివయ్య



ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి స్వామివారి గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం అర్చకులు ఆలయంలో శివయ్యకు విశేష అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలను నిర్వహించారు. రాత్రి ఆలయంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవ మూర్తులను నంది వాహనంపై ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శివయ్య క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, నీరాజనాలు సమర్పించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయితీలో కోటి రూపాయలకుపైగా జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వచ్చే వారం జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ కార్యాలయంలో రెండో సారి వెరిఫికేషన్ జరుగుతుందని జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ తెలిపారు. వెరిఫికేషన్‌కు సర్పంచ్ తోట ఏసమ్మ, ప్రస్తుత కార్యదర్శి, గతంలో పనిచేసిన గ్రామ కార్యదర్శిని రికార్డులతో హాజరుకావాలని ఆదేశించామన్నారు. కాగా దెందులూరు గ్రామ పంచాయితీ నిధుల దుర్వినియోగంలో గ్రామ సర్పంచ్ చెక్ పవర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయితీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ రద్దు చేసిన సంగతి విధితమే.

తల్లిని గాయపరచిన కొడుకుకు రిమాండ్

దెందులూరు: చల్లచింతలపూడిలో తల్లిని గాయపరచిన ఘటనలో కొడుకు నల్లిబోయిన చక్రపాణిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై కె.స్వామి చెప్పారు. నిందితుడిని భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఐక్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): దళిత బహుజనులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. దళిత బహుజనుల ఆత్మీయ సమావేశం స్థానిక ప్లాష్ కార్యాలయంలో శనివారం డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, దేవర కొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దళిత బహుజనులంతా ఏకమై బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రలోభాలకులోను కాకుండా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నేతల రమేష్ బాబు, మంచెల్ల ఇస్సాక్, సిర్రా భరత్, ఎల్‌వీ చైతన్య, ఈపిజర్ల మణిరాజ్, మేరుగు సత్యనారాయణ, చింతా మహాలక్ష్మడు, మత్తే బాబి, మేడిశెట్టి గిరిబాబు, భూపతి అప్పారావు, కొరబండి బాబూరావు, కనికెళ్లి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం వెళ్లి పింఛన్ అందజేత

పెదవేగి : గ్రామంలోనేకాక సుదూర ప్రాంతల్లో ఉన్నటువంటి వివిధ రకాల ఫించన్ లబ్ధిదారులకు వలంటీర్‌లు వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తున్న తీరు విమర్శకులను సైతం ఆలోచింపజేస్తోంది. పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన వెగేశ్న రామసీతమ్మ అనారోగ్య కారణంతో భీమవరంలో ఉంటుంది. విషయం తెలుసుకున్న విజయరాయి వలంటీర్ బి విజయ్‌కుమార్ శనివారం భీమవరం వెళ్లి ఫించన్ అందించాడు. వలంటీర్‌ను గ్రామ సర్పంచ్ గొట్టాపు కృష్ణావేణి, ఉపసర్పంచ్ లేగల శివ తదితరులు అభినందించారు.

మోటారు ఏర్పాటు

దెందులూరు: పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామంలో మంచినీటి చెరువులో ఉన్న మురుగునీరు బయటకు తోడటానికి శనివారం మోటారును ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. అనంతరం ఉండ్రాజవరం గ్రామంలో శ్మశానంలో పిండప్రదానం చేయడానికి ఉన్న చెరువును తవ్వి ఆధునికీకరించామని, దీనివల్ల ఉండ్రాజవరం గ్రామంలో అంత్యక్రియలు తదనంతరం పరిస్థితులకు ఇకపై ఇబ్బందులు ఉండవన్నారు. సున్నా నరేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సున్నా ఫణి పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు చేయూత

ఏలూరు రూరల్ : వివిధ రంగాల్లో సేవలు అందించేందుకు అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) కృషి చేస్తుందని ఆప్త ప్రతినిధి ఆకుల శ్రీధర్ తెలిపారు. శనివారం ఏలూరులో నిర్వహించిన ఆప్త సేవా కార్యక్రమం వివరాలను వెల్లడించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 184 మంది విద్యార్థులకు రూ.28.40 లక్షలు అందజేశామని తెలిపారు. సినీగేయ రచయిత అనంత శ్రీరామ్, అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డాక్టర్ శానం విజయ మోహన్, బొల్లు సోమశేఖర్, మేకా అప్పాయమ్మ, బొడ్డు వెంకటేశ్వరరావు తదితరుల చేతులమీదగా విద్యార్థులకు నగదు అందజేశామన్నారు.